
# కొత్తరకం పెళ్ళి



రమాదేవి

పెళ్ళిచూపుల తంతు ప్రారంభమయింది. 'ఈ సంబంధం చాల మంచిది మా గిరిజకు తప్పకుండా కుదిరేట్టు చూడు స్వామి' అని శాంతమ్మ దేవుడికి మొక్కుకుంది. కూతుర్ని కూడ దణ్ణం పెట్టుకోమంది.

హాలులో పెళ్ళికొడుకు సురేష్, అతడి తల్లి, తండ్రి స్నేహితుడు ఆసీనులై వున్నారు. గిరిజ వచ్చి వాళ్ళ ముందు కూర్చుంది. పెళ్ళికొడుకు తండ్రి, గిరిజ తండ్రి రఘురామయ్యతో, అతడి స్నేహితుడితో గిరిజ తమ్ముడు మాటాడుతున్నారు.

అయిదు నిముషాలు గడిచింది.

"అమ్మాయికి ఇన్‌కన్‌వీనియన్‌ట్‌గా వుంటే లోపలికి వెళ్ళమనండి" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

ఆయనకు మనస్సులోనే 'థాంక్స్' చెప్పకుని, అక్కడినుంచి మెల్లగా లోపలికి వెళ్ళిపోయింది గిరిజ.

అసలు పెళ్ళిచూపులకు కూర్చోనని తను వింత మొండిచేసి, చివరకు అమ్మ, నాన్న 'ఇదొక్కసారికేన'ని బ్రతిమాలితే ఒప్పుకొన్న విషయం తల్చుకుని, భారంగా నిట్టూర్చింది. 'ఈ సంబంధం కుదిర్తే సరే, లేకపోతే ఇంక పెళ్ళిచూపులకు కూర్చోడమనేది లేదు.' అని మనస్సులోనే గట్టిగా నిర్ధారణ చేసుకుంది గిరిజ.

"హాయిగా ప్రేమించి పెళ్ళి చేసుకుంటే ఎంతసుఖం. ఈ పెళ్ళిచూపులు, ఒక్కొక్కసారి పాతిక రూపాయల ఖర్చు తప్పేవి. పైగా కానీ కట్నం వుండదు. 'తంతే బూరెల బుట్టలో పడ్డట్టు' వుండాలి గాని; మరి యే బుట్టలోనన్నా పడితే జీవితం అవమానాల పాలవుతుంది. హూ! అలాంటి అవకాశము, ధైర్యం రెండు లేవు. కనుక నీళ్ళు వదులుకోవచ్చు. ప్రతిసారి పెళ్ళిచూపులు జరగడము, వాళ్ళు పలురకాల ఫలహారాలు తిని వెళ్ళడము, 'పిల్ల మాకు నచ్చలేదనో', 'జాతకాలు కుదరలేదనో,' 'మా అబ్బాయి ఇప్పుడల్లా పెళ్ళి చేసుకోడనో' ఏదో కుంటిసాకు చెప్పి, 'నో' అవడం అలవాటేకదా" అనుకుంది విరక్తిగా గిరిజ ఓ అయిదారు పెళ్ళిచూపులు జరిగిన అనుభవంతో.

*　　*　　*

ఆ రోజు ప్రొద్దున్నే లేచి; మొహం కడుక్కుని, తుడుచుకుంటూ హాలులోకి వచ్చింది గిరిజ.

ఫోన్ మ్రోగింది.

రిసీవర్ అందుకుని, అవతలి గొంతు తన పేరు చెప్పగానే వులిక్కిపడి, నాన్నగార్ని పిలవడానికి వెళ్ళింది. రఘురామయ్య గబ

గబా వచ్చి, "హలో! నమస్కారమండీ. ఆ! నేనే మాట్లాడుతున్నా. ఆ, ఆ, నిజంగానా? చాల సంతోషమండీ. ఆ... రండి తప్పక రండి చాల థాంక్స్. నమస్కారమండీ." అని ఫోన్ పెట్టేసి గబగబా వంటింట్లోకి వెళ్ళి, "శాంతా! మొన్న వచ్చి వెళ్ళిన పెళ్ళి వాళ్ళకు మన అమ్మాయి నచ్చిందట. మిగతా విషయాలు అన్నీ మాట్లాడడానికి రేపు సాయంకాలం నాలుగు గంటలకు వస్తారట" అని గుక్క తిప్పుకోకుండా చెప్పేశారు.

ఇద్దరూ ఎంతో సంబరపడ్డారు. నిజం చెప్పాలంటే ఆ వార్త విన్న గిరిజ కూడ చాల సంతోషపడింది, ఇక పెళ్ళిచూపు లుండవు కదా అని. పాపం! పెళ్ళిచూపులకు కూర్చుని, కూర్చుని ఆమె ప్రాణం విసిగి పోయింది కాబోలు.

శాంతమ్మ కూతుర్ని పెళ్ళి కూతుర్ని చేసింది. తలంటుపోసి, క్రొత్త చీర కట్టబెట్టింది. పప్పు, పాయసం వండి, పండగ చేసింది. ఆమె ఆనందానికి హద్దు లేక పోయింది. ఇక తమ్ముడు, చెల్లెలు పరిహాస మాడుతుంటే, గిరిజకు నిజంగా సిగ్గు ముంచుకొచ్చింది. పెళ్ళంటే నిజంగా ఇంత ఆనందంగా ఉంటుందని ఆమె వూహించుకోలేదు. పైగా సంబంధాలు చూసి, చూసి విసిగిపోయారేమో, ఈ సంబంధం కుదిరిందనేటప్పటికి ఇల్లు పెళ్ళిల్లులాగ మారి పోయింది.

చెల్లెలు అప్పుడే ఫ్రెండ్స్‌కి ఫోన్‌చేసి "అక్క మారేజ్ ఫిక్స్ అయింద"ని చెప్పడంలోను, తమ్ముడు ఇన్విటేషన్స్‌కి ఏ డిజైను బాగుంటుందా అని ఆలోచించడంలోను నిమగ్నులైపోయారు.

ఆ రోజు తను చూసిన 'సురేష్‌ఫొటో' మననం చేసుకుని, 'ఫర్వాలేదు. అందగాడు కాకపోయినా, ఆ హెర్‌స్టైల్ అతడికి అందొచ్చింది. మంచి పొడుగరి. పొడుక్కి తగ్గలావు' అని మనస్సు కుదుట పరుచుకుంది గిరిజ.

* * *

కాఫీ, ఫలహారాలు, పెళ్ళి మాటలు అయ్యాక, గిరిజ తల్లిదండ్రుల నుద్దేశించి సురేష్.

"మీ అమ్మాయితో పర్సనల్‌గా ఓ పదినిముషాలు మాట్లాడాలి. పెళ్ళి ఫిక్స్ అయింది గనుక అడుగుతున్నాను. మీకేమన్నా అభ్యంతరమా ?" అన్నాడు.

శాంతమ్మ, రఘురామయ్య మొహంకేసి చూసింది. "అబ్బే! ఏం లేదండి" అన్నాడు ఆయన అర్థమైనట్టుగానే.

లోపలికెళ్ళి గిరిజను పిల్చుకు వచ్చారు. హాలు ప్రక్కనుండే గదిలోకి దారితీశాడు సురేష్. తల్లిదండ్రులు చెప్పినట్టే అతడ్ని అనుసరించింది గిరిజ.

కొంచెంసేపు ఇద్దరూ మౌనంగా గడిపారు. తర్వాత సురేష్ మొదలెట్టాడు.

"మిస్ గిరిజా! పెళ్ళి ఫిక్స్ చేసుకుంటున్నారు కదా మీ అమూల్యమైన అభిప్రాయం కూడా చెబితే బావుంటుంది. అంటే నేను నచ్చానా అని..." అని సాగదీశాడు.

"ఊఁ" పొడిగా అంది గిరిజ.

"మన పెళ్ళి గురించి నా అభిప్రాయమేమిటో చెప్పడానికే ఈ పర్సనల్ ఇంటర్వ్యూ అడిగాను. మీ కిష్టమయితే సరే. లేకపోతే..." ఆపాడు.

"చెప్పండి" అంది.

"కట్నం క్రింద మీ వాళ్ళు నాకు పది వేలు ఇస్తామన్నారు. పెళ్ళి ఖర్చు, మీకు చీరలు, నగలు కలిసి ఇంకో పదిహేను వేలవుతుంది. నాకిచ్చే పదివేలలో నాలుగైదు వేలు ఖర్చవుతుంది. ఈ పాతిక వేలలో పెళ్ళయ్యాక మనకు మిగిలేదే సగం కన్నా తక్కువ. ఈ డబ్బు వృధాగా దేనికి ఖర్చు పెట్టడం చెప్పండి. కళ్యాణమండపం, వంటవాళ్ళు, భోజనాలకే బోలెడు ఖర్చవుతుంది. భోజనాలలో ఒక్కొక్క విస్తట్లో ఎంత వేస్తున్నారో మీకు నేను వేరే చెప్పనక్కరలేదనుకుంటాను. మనం పిలిచి భోజనం పెట్టేవాళ్ళందరూ సగం వదిలేసి వెళ్ళేవాళ్ళే. పది మంది బీదవాళ్ళను పిలిచి భోజనం పెట్టినా పుణ్యం వస్తుంది.

అందుకని నా అభిప్రాయమేమిటంటే రిజిస్టరు మారేజ్ చేసుకుందాం అని. దీని వలన మనకు డబ్బు మిగులుతుంది. దాన్ని మనం మన సంసారానికి కావలసిన వస్తువులను కొనుక్కోవడానికో, మరి యే మంచి పనికో వినియోగించుకోవచ్చు. అంతేగాని ఇలా తగలేస్తే ఏమొస్తుంది చెప్పండి" అంటూ జవాబుకోసం ఆమె కళ్ళల్లోకి సూటిగా చూశాడు సురేష్.

"నేను చాలా రోజులనుంచి అలాగే అనుకుంటున్నానండి" అని వెంటనే అనేసి ఆగిపోయింది గిరిజ.

"చెప్పండి మీ అభిప్రాయమేమిటో" అన్నాడు కుతూహలంగా.



ఆంధ్రా మెట్రిక్యులేషన్

పోస్టల్ కోచింగ్

తెలుగు/ఇంగ్లీషు మీడియంలు.

SEPTEMBER 1980 EXAMN

ప్రాస్పెక్టస్ ఉచితము

Dr. Y. Ramojirao, M.A; M.Ed; ph.D

Principal కు వెంటనే వ్రాయండి.

**Venus Tutorial College**

59, Usman Road T. Nagar.

MADRAS-17.

హస్తప్రయోగము - నపుంసకత్వము

సెక్సు హాస్పిటల్



దురభ్యాసాలకు లోనై దాంపత్య సౌఖ్యం అనుభవించ లేనివారు వెంటనే సంప్రతించండి!

డా॥ A. పూర్ణచంద్రరావు

(సెక్సు స్పెషలిస్టు) N.D.F.N.F.U(CEYLON) R.A.M.P

గవర్నరుపేట, మ్యూజియంరోడ్, విజయవాడ-2. (A.P)

సుఖవ్యాధులకు ప్రత్యేక చికిత్స

VTS/P/84


## కార్టూన్లు పంపేవారికి మనవి

కార్టూన్లతో పాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరు పెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6నుంచి 8 వారాలు పట్టవచ్చును. ఈలోగా, నేరుగా కాని, టపాలోగాని వీటిపై ఉత్తరప్రత్యుత్తరాలకు తావు ఉండదు. కార్టూన్లు 'టపా'లో పోయినా, దారితప్పిపోయినా సంపాదకుని బాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్లు పంపేవారు కవరు మీద ఆ సంచికపేరు ఉదహరించాలి. ఈ కార్టూన్లకికూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

సం.

# కొత్తరకం పెళ్లి

"అదే రిజిస్ట్రరు మారేజ్ అయితే బాగానే ఉంటుంది గని, పెద్ద వాళ్ళు అంగీకరించాలి కదండీ..." అంటూ ఆపేసింది.

"మా అమ్మ, నాన్నగారిని నేను ఒప్పించగలను. నాకా ధైర్యం వుంది. ఇక మీవాళ్ళ విషయం మీరు చూసుకోవాలి. మొదట మీరు ఇష్టపడతారో లేదో కనుక్కొని, తర్వాత మా వాళ్ళను అడగుదామని మీతో మాట్లాడవల్సి వచ్చింది మీకు. నాకు సమ్మతమే. ఇక మీ పెద వాళ్ళ అంగీకారమే తెలియాలి. అంతగా కావలిస్తే, పెళ్ళవగానే ఒక చిన్న 'టీ పార్టీ' ఇద్దాం మన ఫ్రెండ్స్‌కి" అన్నాడు.

"వాళ్ళను ఒప్పించగలనని గట్టిగా చెప్ప లేను గని, గట్టిగా ప్రయత్నం మాత్రం చెయ్యగలను" అంది గిరిజ మెల్లగా.

"ఆ మాత్రం చేస్తే చాలండి. అప్పటికీ వారు ఇష్టపడకపోతే, మామూలు తతంగం వుండనే వుంది కదా" అంటూ నవ్వేశాడు సురేష్. అతడి నవ్వులో శృతికలిపింది గిరిజ.

* * *

"పెద్దకూతురు, మనింట్లో - మొదటి కార్యం. నేను ఒప్పుకోను ఆ సంతకాల పెళ్ళికి" అంది శాంతమ్మ పట్టుదలగా.

"అమ్మా! కల్యాణమండపం దొరకడం అంత తేలికకాదు. వంట వాళ్ళను కూడా అపాయింట్‌మెంట్ మీదగాని మాట్లాడానికి కుదరదు మేళగాళ్ళు అంతే. ఇక రిసెప్షన్ అంటే ఏదో ఒక మ్యూజికల్ కన్సర్ట్ వుండాలి. వీళ్ళందరికోసం తిరిగేటప్పటికి అబ్బబ్బ! తలప్రాణం తోకకు వస్తుంది. నీకేం తెలుస్తాయిలే ఆ కష్టాలన్నీ! హాయిగా రిజిస్ట్రరు మేరేజ్ చేసేసి, ఏ హోటల్లో నన్నా ఓ పార్టీ ఇచ్చేద్దాం" అన్నాడు గిరిజ తమ్ముడు.

"ఏమో బాబు, నా మనస్సు దీనికి ఏ మాత్రం అంగీకరించటం లేదు" అంది శాంతమ్మ

ఆమెకు ఎలా నచ్చచెప్పాలో తెలియక, అందరు సతమత మవుతున్నారు.

"అమ్మా! నువ్వు అప్పడాల దగ్గర నుంచి మడి, మడి అని మొదలెట్టి, ఉపవాసం చేసుకుని, మళ్ళీ నీ ఆరోగ్యం పాడు చేసుకుంటావు" అంది గిరిజ కనీసం ఆరోగ్యం మీది శ్రద్ధతోనన్నా ఆమె మనస్సు మారుతుందేమోనన్న ఆశతో.

"బావుంది. 'పెళ్ళి' అన్నాక ఆమాత్రం హడావిడి అయినా లేకపోతే ఎలాగే?" అంటూ సాగతీసింది శాంతమ్మ.

"నువ్వు అసలే బి.పి. పేషంట్‌వి. అవన్నీ మొదలెట్టి, ఆరోగ్యం పాడు చేసుకునేటట్టయితే, అమ్మాయిని, అబ్బాయిని ఇప్పుడే వెళ్ళి చేసుకుని రమ్మంటాను. నీకు నాలుగు అక్షింతలిచ్చి దీవించమంటాను. అంతేగని, మళ్ళీ నువ్వు మంచాన పడ్డావంటే గిరిజ కూడా వుండదు ఎలాగూ కాలేజికి వెడుతుంది. నీకు సేవలు చేసే వాళ్ళు, మాకు ముద్ద పెట్టేవాళ్ళు కూడా వుండరు. ఈ పెళ్ళికి ఒప్పేసుకో." అన్నారు ఆయన ఆమె ఒంట్లో బాగులేక చేసిన గొడవను తలుచుకుని భయపడుతూ.

మనస్ఫూర్తిగా ఇష్టం లేకపోయినా, ఆరోగ్యరీత్యా ఒప్పుకోక తప్పింది కాదు శాంతమ్మకి.

* * *

"మా పెళ్ళికి పాతికవేలు ఖర్చుపెట్టినా, అందులో సగం కన్నా తక్కువ కూడా మా చేతికి రాదు. రిజిస్ట్రరు మేరేజ్ చేసుకుంటే ఆ మొత్తం మాకు బాగా వుపయోగపడుతుందని మేమిద్దరం కలిసి, ఈ నిర్ణయాని కొచ్చాం." అన్నాడు సురేష్ పెళ్ళయ్యాక మిత్రులకిస్తున్న పార్టీలో.

"మీరు ఇంత ముందాలోచనతో వివాహం చేసుకుంటున్నారని తెలిసి, మేము కూడా మాకు తోచినట్టుగా అందరం కూడ కలుక్కొని 'ఇది' తెచ్చాం" అంటున్న మిత్రుల వైపు ఆశ్చర్యంగా చూశాడు సురేష్

వాళ్ళందరు తమ శక్తి కొలది ఇవ్వాలనుకున్న డబ్బును మొత్తం కలిపి, క్రొత్త కాపురానికి కావలసిన ముఖ్యమైన వస్తువులను 'ప్రెజెంట్'గా ఇస్తుంటే, సురేష్ తన కృతజ్ఞతను మాటల్లో వెల్లడించలేక పోయాడు.

అతడి దూరాలోచనను మనస్సులోనే హర్షించింది గిరిజ.